క్లుప్తంగా

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ



జస్టిస్ సురేష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని అరసవిల్లి , శ్రీకూర్మం, శ్రీముఖలింగం పుణ్యక్షేత్రాల దర్శనార్థం వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్ రెడ్డిని ఎస్పీ రాధిక శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఆమె వెంట ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న వేణుగోపాలరావు

జి.సిగడాం: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసర్వేతో చేకూరనున్న లబ్ధిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా సర్వేరాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చిరంజీవి

ఎచ్చెర్ల: మండలంలోని ఫరీదుపేట గ్రామం.. కొయ్యిరాళ్ల జంక్షన్ వద్ద జీజీఎంపీ నిధులు సుమారు 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీపీ మొదలవలస చిరంజీవి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, ఉపసర్పంచ్ సత్తారు గోపి, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మొదలవలస కృష్ణ, సత్యన్నారాయణ, ఏఈ సూర్యచంద్ర ఉన్నారు.

మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ వరం



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ రమ్యప్రియ

జి.సిగడాం: మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ వరంలాంటిదని ఎంఈవో–1 అరసాడ రవి, డాక్టర్ లావేటి రమ్యప్రియ అన్నారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలను శుక్రవారం అందించారు. ఎస్ఎస్ఏ ద్వారా ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. దివ్యాంగు పిల్లలకు ఇంటిదగ్గర ఫిజియోథెరపీ అందిస్తే త్వరగా కోలుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 ముళ్ల శ్రీనివాసరావు, ఐఈడీ ఉపాధ్యాయుడు కృష్ణ ఉన్నారు.

ఉపాధి మేట్లకు శిక్షణ



పాలఖండ్యాంలో మాట్లాడుతున్న ఏపీడీ లోకేష్

జి.సిగడాం: ఉపాధి హామీ పథకం మేట్లు సక్రమంగా పని చేయాలని ఏపీడీ లోకేష్ అన్నారు. మెట్టవలస, నిద్దాం, పాలఖండ్యాం, నాగులవలస, పెంట, సీతంపేట, మద్దివలస గ్రామాల్లో మేట్లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. గత ఏడాదిలో రైతులకు ఉపయోగంగా ఉంటుందని తోటపల్లి, మడ్డువలస ప్రధాన, పిల్ల కాలువల్లో వేతనదారులతో పూడికలను తొలగించామన్నారు. ప్రతి వేతనదారుడికి కనీసం 272 రూపాయలు వేతనం గిట్టుబాటయ్యేలా కృషి చేయాలన్నారు. ఏపీవో చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, టీఏలు ఎస్.లక్ష్మణరావు, కీర్తి గణపతి, వై.వైకుంఠరావు. జె.మన్మథరావు, సతీష్ బి.రాంబాబు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పోషకాల గోరుముద్ద

- రోజుకో వంటకంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- వారంలో మూడు రోజులు రాగి జావ, ఐదు రోజులు కోడిగుడ్డు
- మెనూ ప్రకారంపై హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



మెనూ మేరకు వడ్డన



అల్లినగరంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్ల నివారణతో పాటు పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్నం భోజన పథకం అమలు చేస్తోంది. గత పాలకుల్లో కొరవడిన చిత్తశుద్ధి, పర్యవేక్షణ లోపం, అరకొర నిధుల కేటాయింపు కారణంగా సరైన ఆహారం అందేది కాదు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకంపై ప్రత్యేక దృష్టి సారించారు. జగనన్న గోరు ముద్ద పేరుతో పౌష్టికాహారం అందించే లక్ష్యంతో ప్రత్యేక మెనూ రూపొందించారు. విద్యార్థులకు వారం రోజులు రూపొందించిన మెనూ అమలయ్యేలా, పోషకాహారం అందేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

పక్కాగా నిర్వహణ..

పాఠశాలల్లో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల కమిటీల నుంచి అభిప్రాయాలు సేకరించి రోజుకో వంటకంతో వారం రోజుల మెనూ రూపొందించారు. నాణ్యమైన భోజనం పిల్లలకు అందజేస్తున్నారు. రోజూ ఉపాధ్యాయులు భోజనం పరిశీలించిన తరువాత విద్యార్థులకు పెడుతున్నారు. గతంలో వారంలో మూడు సార్లు కోడి గుడ్లు అందించేవారు. చాలా సార్లు నాసిరకం గుడ్లు సరఫరా చేసేవారు. ఈ నేపథ్యంలో తాజా గుడ్లు సరఫరా చేయటం, వారంలోపు వడ్డించేలా గుర్తులు వేసి నాణ్యమైన గుడ్లు విద్యార్థులకు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

జగనన్న గోరుముద్ద మెనూ...	
సోమవారం	కారం పొంగల్, ఉడికించిన గుడ్డు
మంగళవారం	పులిహోర, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం	వెజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
గురువారం	నిమ్మకాయ పులిహోర, ఉడికించిన గుడ్డు, రాగి జావ
శుక్రవారం	ఆకు కూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరు శనగ చిక్కీ
శనివారం	తీపి పొంగల్, పప్పు, రసం, రాగి జావ

ఎచ్చెర్ల మండలంలో గోరుముద్ద వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు	82
ప్రాథమికోన్నత పాఠశాలలు	5
ఉన్నత పాఠశాలలు	16
మొత్తం విద్యార్థులు	7314
మొత్తం ఏజెన్సీలు	103

వంటలు భేష్..



ఐదు రోజులు కోడి గుడ్లు ఇస్తున్నారు. నాణ్యమైన, రుచికరమైన భోజనం పెడుతున్నారు. గతంలో భోజనం తినాలని పించేది కాదు. ప్రస్తుతం ఇంటి దగ్గర కంటే మెరుగ్గా భోజనం పెడుతున్నారు. పోషక విలువలతో కూడిన భోజనం చేయటం ఆనందంగా ఉంది.

– జి.చరణ్‌తేజ, 9వ తరగతి, అల్లినగరం ఉన్నత పాఠశాల

పోషకాహారం..



ప్రతి వంట రుచికంగా ఉంటోంది. వారంలో మూడు రోజులు ఇస్తున్న రాగ జావ సైతం రుచికరంగా ఉంది. ఇష్టంగా తాగుతున్నాం. వేరు శనగ చిక్కీలు స్నాక్స్‌లా ఉపయోగ పడుతున్నాయి. రుచికరమైన మధ్యాహ్న భోజనం పెట్టిస్తున్న జగన్ మామయ్యకు థ్యాంక్స్.

– ఎం.ఢిల్లీశ్వరి, 9వ తరగతి, అల్లినగరం ఉన్నత పాఠశాల

పక్కాగా మెనూ అమలు..



వంటగది గోడలపై రాసి మెనూ అమలు చేస్తున్నారు. ప్రతి రోజూ ఇష్టంగా తింటున్నాం. అన్నం, గుడ్డు, చిక్కీ ఇలా ప్రతి ఆహార పదార్థం నాణ్యతగా ఉంటోంది. వారం రోజుల్లో ఒక్క రోజు కూడా భోజనం బాగా లేదన్న ప్రశ్న తలెత్తదు.

– కె.మౌనిక, 10వ తరగతి, అల్లినగరం ఉన్నత పాఠశాల

ఇష్టంగా తింటున్నాం



జగనన్న గోరు ముద్దలో పోషకాహారాలు అంశంపై ఉపాధ్యాయులు అనేకసార్లు తెలియ జేస్తుంటారు. అందుకే ప్రతి రోజూ ఇష్టంగా తినటం అలవాటు చేసుకున్నాం. పేద విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, డ్రాపౌట్ల నిర్మూలనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది.

– సీహెచ్ దుర్గాప్రసాద్, 10వ తరగతి, అల్లినగరం ఉన్నత పాఠశాల

ఉత్సాహంగా క్రీడా పోటీలు



జి.సిగడాం: పోటీల ప్రారంభంలో నాయకులు



రణస్థలం: వెల్పురాయిలో కబడ్డీ పోటీలు జరుగుతున్న దృశ్యం



శ్రీకాకుళం రూరల్: వాలీబాల్ పోటీల టాస్ వేస్తున్న సర్పంచ్ రవికుమార్

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని లంకాం పంచాయతీ గ్రామ సచివాలయం వద్ద ఆడుదాం ఆంధ్రా పోటీలను సర్పంచ్ చిట్టి రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జి.సిగడాం: 'ఆడుదాం–ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. పాలఖండ్యాం, జగన్నాథపురం, సీతారామపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పోటీలను గ్రామ సర్పంచ్ ధారబోయిన రెయిమ్మ, ఉపసర్పంచ్ ఇజ్జి గోవిందరావు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ధారబోయిన ధర్మారాజ్, రాయపురెడ్డి సూర్యనారాయణ, వెంకటఅప్పారావు, జీవన్, వడ్డి ఆదినారాయణ, పీడీలు రాహుల్, యుగంధర్, రాజ్యలక్ష్మి, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

రణస్థలం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు జరుగుతున్నాయని ఎంపీడీవో ఆర్.వి రమణమూర్తి చెప్పారు. మండల వ్యాప్తంగా 3,228 మంది పోటీల్లో పాల్గొంటున్నారు. ఏవో ధనుంజయరావు, వ్యాయమ ఉపాధ్యాయులు ఉన్నారు.

2న న్యాయవాదులు విధులకు హాజరు



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): జనవరి 2న న్యాయవాదులంతా తాత్కాలికంగా విధులకు హాజరు కావాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటలింగ్ యాక్టు–23ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు చేపడుతున్న విధుల బహిష్కరణ, హైకోర్టులో రిట్ వేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జనవరి 2 నుంచి న్యాయవాదులు విధులకు హాజరు కావాలని తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం పలు అంశాలను చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు బెజ్జిపురపు ఫల్గుణరావు, సనపల హరి, అన్నెపు సత్యనారాయణ, కూన అన్నంనాయుడు, ఖగేంద్ర, శిష్టు రమేష్, మామిడి క్రాంతి, కూన రాజారావు, ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, కిలారి ఈశ్వరరావు, జయకుమార్, జల్లు తిరుపతిరావు, అప్పారావు పట్నాయక్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, అన్నెపు భువనేశ్వరరావు, కంచరాన నాగభూషణరావు, కొంక్యాన సుభాష్, ఎన్ని రమేష్ పాల్గొన్నారు.

విజేతలుగా తిరిగిరావాలి



ఫెన్సింగ్ క్రీడాకారులతో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జాతీయ స్థాయి జూనియర్ ఫెన్సింగ్ పోటీల్లో సత్తాచాటి విజేతలుగా తిరిగిరావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ స్థాయి పోటీలకు బయలుదేరిన వీరికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఆగస్టులో భీమవరంలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన సంపతరావు గౌతమ్ చంద్ర (సాబర్ విభాగం), సాహుకారి మురళీకృష్ణ (ఇప్పి విభాగం) నుంచి ప్రతిభను కనబరిచి పతకాలు సాధించి జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకి రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. ఈ నెల 31 నుంచి జనవరి 3 వరకూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో కోచ్ జోగిపాటి వంశీ, డాక్టర్ కంఠ వేణు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌టీఈ సభ్యులపై పక్షపాత ధోరణి వీడాలి



రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న ఏపీ సర్కిల్ కార్యదర్శి అంజయ్య

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో ఎన్ఎఫ్‌టీఈ సభ్యుల పట్ల అధికారులు వేధింపులను ఖండిస్తున్నామని, పక్షపాత ధోరణి వీడాలని ఎన్.ఎఫ్.టి.ఇ. బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ కార్యదర్శి కె.అంజయ్య అన్నారు. శుక్రవారం ఎన్ఎఫ్‌టీఈ బీఎస్ఎన్ఎల్ యూనియన్ రాష్ట్ర మహాసభల్లో భాగంగా పి.నారన్నాయుడు, బి.సూర్యనారాయణ, జి.అప్పారావు, డి.భాస్కరరావు ఆధ్వర్యంలో నగరంలోని క్రాంతిభవన్ (సీపీఐ కార్యాలయం)లో జరిగిన సమావేశానికి అంజయ్యతో పాటు రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి శేషాద్రి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల వేతన సవరణ అతి త్వరలో పరిష్కారమవుతుందని, 4జీ సేవలు అందుబాటులోకి వస్తాయని, బీఎస్ఎన్ఎల్ ఎప్పుడూ మూతపడదని చెప్పారు. మేనేజ్‌మెంట్‌కు రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్ లెటర్లు ఇచ్చి ఏడు నెలలు గడుస్తున్నా యూనియన్ సభ్యులను రిలీవ్ చేయకుండా అధికారులు తాత్సారం చేయడం శోచనీయమన్నారు. రెండో వీఆర్ఎస్ వస్తుందని ప్రచారం తప్ప అధికారికంగా ఎక్కడా చెప్పలేదన్నారు. బీఎస్ఎన్ఎల్ ఆస్తులను కాపాడటానికి అన్ని యూనియన్లు ఎ.యు.ఎ.బి.ఆధ్వర్యంలో సంఘటితంగా పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, హెచ్.వెంకన్నబాబు, యు.రామ్మోహనరావు, పైల లక్ష్మణరావు, హెచ్.లక్ష్మి, ఎస్.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ



శ్రీకాకుళం నానుబాలవీధిలో విజయదుర్గాదేవి ఆలయంలో మార్గశిర శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర నాటకం



ఓ నాటకంలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం, సుమిత్రి కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో వైజయంతి వేదికపై నిర్వహిస్తున్న సంగీత, నాటక, నాదస్వర కచేరీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం ఆద్యంతం అలరించింది. హైదరాబాద్‌కు చెందిన సర్వేశ్వర నాట్య మండలికి చెందిన రాజాబాబు దర్శకత్వంలో అరణ్య, వారణాసి, కాటిసీను ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పులంఖడం శ్రీనివాసరావు, పాగిరి సుగుణాకరరావు, ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, కిల్లాన ఫల్గుణరావు, నక్కశంకరరావు, మండవిల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు అంబేడ్కర్ గురుకులంలో ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ సన్నాహాల్లో విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని బాలికల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం అటల్ టింకరింగ్ ల్యాబ్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. పరిసర ప్రాంతంలోని ఎనిమిది పాఠశాలల విద్యార్థులకు ఎగ్జిబిషన్ చూసేందుకు ప్రవేశం కల్పిస్తున్నట్లు చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన బిస్మితా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రధాన మంత్రి జన్‌మాన్ కార్యక్రమం అధికారి బిస్మితా జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీతంపేటలో నిర్వహించిన సమావేశానికి హాజరైన బిస్మితా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

సంతోషిమాతకు పూజలు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు అభిషేకాలు చేసి అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. ఉద్యాపనలు, మహానివేదన, మహా హారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

శ్రీకాకుళం రూరల్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామ్మోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేట గ్రామంలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం పలు ప్రత్యేక పూజలు జరిగాయి. ఇక్కడ ఉన్న అమ్మవారికి పీఠాధిపతి బాలభాస్కరశర్మ అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలను నిర్వహించారు. శ్రీచక్రాలవద్ద కుంకుమ పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

- శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ శృతి

జి.సిగడాం: గ్రామాల్లో శాంతిభద్రతలు లోపించకుండా సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి సూచించారు. ఎవ్వరైనా అల్లర్లు సృష్టించి శాంతభద్రతలకు భంగం కలిగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జి.సిగడాం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పల్లెల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే అటువంటి వారిపై సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. పోలీసులు గ్రామాల్లో పల్లె నిద్ర చేస్తే అక్కడ ఉన్న సమస్యలను గుర్తించవచ్చన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రణస్థలం సీఐ ఎస్.అదాం, స్థానిక ఎస్సై సామంతుల రామారావు ఉన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: ఏపీటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను సంఘ నాయకులు పెంట యూపీ పాఠశాలలో శుక్రవారం ఆవిష్కరించారు.

కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, మండల శాఖ అధ్యక్షుడు కాయల రమేష్, కార్యదర్శి కిల్లారి వెంకటరమణ, ఉపాధ్యక్షురాలు గేదెల గీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాటం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు.

హౌస్ సర్జన్‌తో అసభ్యంగా ప్రవర్తించిన వైద్యుడు

- రిమ్స్‌లో ఘటన
- చర్యలకు డీఎంఈ సిఫారసు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాలలో హౌస్‌సర్జన్‌గా పనిచేస్తున్న ఓ యువతి పట్ల రమేష్ అనే అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి వైద్యుడు అసభ్యంగా ప్రవర్తించారు. గురువారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి బాధితురాలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, ఆస్పత్రి అభివృద్ధి సలహామండలి సభ్యులు వరుదు విజయకుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బాధితురాలు గురువారం రాత్రి హౌస్ సర్జన్‌గా రిమ్స్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తుండగా అదే వార్డులో డాక్టర్ రమేష్ కూడా విధులు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఓ కేసు విషయంలో చర్చించేందుకు తన గదికి రావాలని బాధితురాలిని పిలిచి లోపలికి వెళ్లగానే గడియపెట్టి అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై శుక్రవారం ఉదయం కమిటీ వేయగా వాస్తవమని నిర్ధారణ అయ్యింది. డాక్టర్ రమేష్ మరో హౌస్ సర్జన్‌తో మద్యం తెప్పించుకుని సేవించినట్లు విచారణ అధికారుల దృష్టికి వచ్చింది. ఈ నివేదికను ప్రిన్సిపాల్‌కు నివేదించగా డాక్టర్‌పై చర్యలకు నివేదికను డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్)కి పంపించారు. అక్కడి నుంచి ఆదేశాలు వచ్చే వరకు సెలవుపై వెళ్లాలని డాక్టర్ రమేష్‌ను ఆదేశించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, ఆస్పత్రి అభివృద్ధి సలహామండలి సభ్యులు వరుదు విజయకుమార్‌లు తెలియజేశారు.

పాటల పోటీలకు తరుణి ఎంపిక



తరుణి

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ తెలుగు చానెల్ మాటీవీలో నిర్వహిస్తున్న సూపర్ సింగర్స్ కార్యక్రమానికి గుజరాతీపేటకు చెందిన పాట్నూరు తరుణి ఎంపికైంది. మొదటి ఎపిసోడ్‌లో పాడేందుకు హాజరవుతున్నానని, ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.

ముగిసిన విలేకరి అంత్యక్రియలు

రణస్థలం: ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని లావేటిపాలెం గ్రామానికి చెందిన సాక్షి విలేకరి జి.దామోదర్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య శుక్రవారం ముగిశాయి. మృతదేహానికి శ్రీకాకుళం సర్వజనాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తరువాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. దామోదర్ మృతదేహాన్ని చూసి భార్య సుజాత, పిల్లలు వర్షిణి, సుమంత్, కుటుంబ సభ్యుల రోదనతో గ్రామంలో విషాదం నెలకొంది. వివిధ పార్టీలకు చెందిన నాయకులు దామోదర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.